క్లుప్తంగా

జగన్ సీఎం కావటం ఖాయం



అవనిగడ్డ: ప్రజల మద్దతుతో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావటం ఖాయమని వైఎస్సార్ సీపీ అవనిగడ్డ ఎమ్మెల్యే అభ్యర్థి సింహాద్రి రమేష్ బాబు అన్నారు. ఆయన బుధవారం నామినేషన్ అనంతరం మీడియాతో మాట్లాడారు. అవనిగడ్డ సభలో సీఎం జగన్ ఇచ్చిన హామీ మేరకు డయాలసిస్ సెంటర్ ఏర్పాటుచేశామని, కోడూరు, అవనిగడ్డ రోడ్డు నిర్మిస్తున్నామని తెలిపారు. ఎదురుమొండి బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయించామన్నారు. అవనిగడ్డ కంపోస్ట్ యార్డ్ ఏర్పాటుకు నిధులు మంజూరైనా ప్రతిపక్షాలు అనునిత్యం అడ్డుకుంటూనే ఉన్నాయని విమర్శించారు. ఇచ్చిన మాట ప్రకారం చుక్కల భూముల సమస్య పరిష్కారం చేసి సీఎం చేతులమీదుగా పట్టాలు ఇప్పించామన్నారు. రాష్ట్రంలో ఫ్యాన్ ఫుల్ స్పీడ్‌తో తిరుగుతోందని, ఆపుదామని ఎవరైనా చేతులు పెడితే వేళ్లు తెగిపోతాయని హెచ్చరించారు.

కార్తికేయుడిని దర్శించుకున్న రమేష్‌బాబు

మోపిదేవి: స్థానిక శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని వైఎస్సార్ సీపీ అవనిగడ్డ ఎమ్మెల్యే అభ్యర్థి సింహాద్రి రమేష్ బాబు బుధవారం దర్శించుకున్నారు. స్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

ఆరు నామినేషన్లు దాఖలు



అవనిగడ్డ: అవనిగడ్డ శాసనసభ స్థానానికి సంబంధించి బుధవారం ఆరు నామినేషన్లు దాఖలయ్యాయి. వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు నామినేషన్ దాఖలు చేశారు. డమ్మీగా సింహాద్రి వికాస్, కాంగ్రెస్ పార్టీ తరఫున అందె శ్రీరామమూర్తి, డమ్మీగా అందె శ్రీవాణి, జైభీమ్ భారత్ పార్టీ అభ్యర్థిగా సముద్రాల అంబేద్కర్, జనసేన డమ్మీగా మండలి వెంకట్రామ్ (రాజా) నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి బాల సుబ్రహ్మణ్యంనకు అందించారు.

నేటి వరకే నామినేషన్లకు గడువు

పెడన: ఇప్పటి వరకు తొమ్మిది మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారని నియోజకవర్గ ఎన్నికల అధికారి పి.వెంకటరమణ బుధవారం తెలిపారు. రమేష్ ఉప్పాల(రాము), హారిక ఉప్పాల రెండు, మూడు సెట్లు చొప్పున నామినేషన్లు వేశారని పేర్కొన్నారు. కాగిత కృష్ణప్రసాద్, కాగిత శిరిష కూడా నామినేషన్ పత్రాలను అందజేశారని వివరించారు. గురువారం మధ్యాహ్నం మూడు గంటల వరకే నామినేషన్లు స్వీకరిస్తామని స్పష్టంచేశారు.

కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం



మచిలీపట్నంటౌన్: నగరంలోని పద్మావతి మహిళా డిగ్రీ కళాశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను హిందూ విద్యాసంస్థల చైర్మన్ డి.జి.శాస్త్రి, ప్రెసిడెంట్ కొనకళ్ల నారాయణరావు బుధవారం ప్రారంభించారు. హిందూ విద్యాసంస్థల పాలకమండలి సభ్యుడు శాస్త్రి, డిగ్రీ కళాశాల, హిందూ కళాశాల, ఎంబీఏ కళాశాల, లా కళాశాల, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్స్ అన్నపూర్ణ, కుటుంబరావు, షిఫాలి, రాయల్, శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ నాగజ్యోతి పాల్గొన్నారు.

ఉత్సాహంగా పాఠశాల వార్షికోత్సవం

ఉత్తరచిరువోలులంక(మోపిదేవి): పేదరికాన్ని అధిగమించడానికి విద్య ఒక్కటే మార్గమని మండల విద్యాశాఖాధికారి ఎస్.దుర్గాసాగర్ అన్నారు. ఉత్తరచిరువోలులంక ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం మంగళవారం రాత్రి ఉత్సాహంగా జరిగింది. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు అడపా గురవయ్య తల్లిదండ్రులు అడపా వెంకట రామయ్య, నాంచారమ్మ జ్ఞాపకార్థం, మరో ఉపాధ్యాయుడు పులగం వెంకటేశ్వరావు తల్లిదండ్రులు విష్ణు నారాయణ, యానాదమ్మ జ్ఞాపకార్థం పాఠశాలలోని ఉత్తమ విద్యార్థులకు 24 మందికి నగదు బహుమతులు అందించారు. ఎంఈఓ–2 కొడాలి రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

మోపిదేవిలో చలివేంద్రం ప్రారంభం

మోపిదేవి: వేసవి ఎండలు, వడగాడ్పులను దృష్టిలో ఉంచుకుని మోపిదేవి ప్రధాన సెంటర్‌లో చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ నందిగం మేరీ రాణి తెలిపారు. ప్రయాణికులు, శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయనికి విచ్చేసే భక్తులకు ఈ చలివేంద్రం సౌకర్యంగా ఉంటుందని పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శి రామకోటేశ్వరావు, గ్రామ సచివాలయ ఉద్యోగులు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కంప్యూటరీకరణ విప్లవాత్మకం

చల్లపల్లి: ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాల కంప్యూటరీకరణ దేశంలో విప్లవాత్మక మార్పని జిల్లా సహకార అధికారి కె.చంద్రశేఖరరెడ్డి అన్నారు. స్థానిక పీఏసీఎస్ ఆవరణలో ఏడు మండలాల కేడీసీసీబీల సూపర్‌వైజర్లు, పీఏసీఎస్‌ల సీఈఓలు, సిబ్బందికి కంప్యూటరీకరణపై బుధవారం సాయంత్రం శిక్షణ ఇచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మార్గదర్శకాలతో అన్ని పీఏసీఎస్‌లను కంప్యూటరీకరణ చేస్తున్నట్లు తెలిపారు. సొసైటీల కంప్యూటరీకరణ ద్వారా సభ్యుల పేర్ల నమోదు, రుణలావాదేవీల నమోదు, డీసీసీబీలకు, ఆప్కాబ్ బ్యాంక్‌కు సొసైటీలను అనుసంధానం చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ సహకార అధికారి వి.వి.ఫణికుమార్ పాల్గొన్నారు.

అవనిగడ్డ జనసంద్రం

- అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేసిన సింహాద్రి రమేష్‌బాబు
- ర్యాలీలో పాల్గొన్న ఎంపీ అభ్యర్థి చంద్రశేఖరరావు, ఎమ్మెల్సీ రవీంద్రనాథ్
- వైఎస్సార్ సీపీ జెండా ఊపుతూ జోష్ నింపిన ఎమ్మెల్యే అభ్యర్థి



లంకమ్మ అమ్మవారికి పూజలుచేస్తున్న రమేష్‌బాబు దంపతులు



నామినేషన్ సందర్భంగా జనసంద్రమైన అవనిగడ్డ

అవనిగడ్డ: వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సింహాద్రి రమేష్‌బాబు నామినేషన్ కార్యక్రమం బుధవారం అట్టహాసంగా జరిగింది. నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ సీపీ అభిమానులు వేలాదిగా తరలి రావడంతో అవనిగడ్డ వీధులు జనసంద్రంగా మారాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా వేల మంది తరలి వచ్చి వైఎస్సార్ సీపీలో జోష్ నింపగా, కూటమిలోని పార్టీలను కలవరపాటుకు గురుచేసింది. నాయకులు, కార్యకర్తల జయ జయ ధ్వానాల మధ్య సాగిన ర్యాలీలో మచిలీపట్నం ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు, ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్, మాజీ ఎమ్మెల్యే అంబటి శ్రీహరి ప్రసాద్, పార్టీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

సర్వమత ప్రార్థనలు

సింహాద్రి రమేష్‌బాబు, కెప్టెన్ లక్ష్మి దంపతులు లంకమ్మ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మసీదు, సీబీఎం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్థానిక లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో నామినేషన్ పత్రాలకు ప్రత్యేక పూజలు చేయించారు.

కదం తొక్కిన కార్యకర్తలు

అవనిగడ్డలోని వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి సంతమార్కెట్, కోర్టు సెంటర్ మీదుగా నామినేషన్ కేంద్రం వరకూ సాగిన ర్యాలీలో కార్యకర్తలు కదం తొక్కారు. ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు, ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్, సింహాద్రి వికాస్, సింహాద్రి రామ్‌చరణ్ ప్రత్యేక వాహనంపై ఊరేగింపుగా రాగా పదివేలకు మందికి పైగా కార్యకర్తలు పాల్గొన్నారు.

భారీ గజమాలతో సత్కారం

ర్యాలీ మధ్యలో ప్రత్యేక క్రేన్ సహాయంతో భారీ గజమాలతో ఎమ్మెల్యే అభ్యర్థి సింహాద్రి రమేష్‌బాబు, ఎంపీ అభ్యర్థి డాక్టర్ చంద్రశేఖరరావును సత్కరించారు. ఈ సందర్భంగా జిందాబాద్ వైఎస్సార్ సీపీ, వర్ధిల్లాల్లి జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వం అన్న నినాదాలతో ఆ ప్రాంతం మార్మోగింది. వైఎస్సార్ సీపీ జెండా రంగులున్న కాగితాలతో పూల వర్షం కురిపించారు.

జోష్ నింపిన రమేష్‌బాబు

ర్యాలీలో భాగంగా 'జెండలు జతకట్టడమే మీ అజెండా..' అనే పాటకు అనుగుణంగా సింహాద్రి రమేష్ బాబు భారీ పార్టీ పతాకాన్ని పట్టుకుని అటూ ఇటూ ఊపుతూ కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు. ఆయన జెండా ఊపినంత సేపు కార్యకర్తలు జై జగన్.. జైజై జగన్ అంటూ నినాదాలతో హోరెత్తించారు.

కూటమిలో గుబులు

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు నామినేషన్‌కు పదివేల మందికి పైగా కార్యకర్తలు, నాయకులు, అభిమానులు తరలి రావడంతో కూటమి పార్టీలో కలవరం మొదలైంది. కోర్టు సెంటర్ నుంచి ఫైర్ స్టేషన్ సెంటర్ వరకూ కిలో మీటర్ పొడవున ఉన్న భారీ ర్యాలీ ప్రత్యర్థి కూటమిలో గుబులు రేపినట్టయింది. పెద్ద ఎత్తున యువతతో పాటు మహిళలు, వృద్ధులు సైతం భారీగా తరలి రావడంతో వైఎస్సార్ సీపీలో మరింత జోష్ నింపింది.

కోడూరు మండలం నుంచి..

కోడూరు: వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సింహాద్రి రమేష్‌బాబు నామినేషన్ కార్యక్రమానికి కోడూరు మండలం నుంచి పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు. స్థానిక పార్టీ కార్యాలయం వద్ద నేతలు, కార్యకర్తలు, అభిమానులు భారీ బైక్ ర్యాలీగా అవనిగడ్డకు వెళ్లారు. సుమారు వెయ్యి బైకులతో ర్యాలీ నిర్వహించారు. దారి పొడవునా 'జై జగన్' నినాదాలతో హోరెత్తించారు. జెడ్పీటీసీ సభ్యుడు యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, పార్టీ నాయకులు పరిశె మాధవరావు, కొండవీటి వీరవెంకటనారాయణరావు, కడవకొల్లు శ్రీనివాసరావు, కోట పద్మావతి, గుర్రం బసవయ్య, చేబోయిన కృష్ణారావు, వెన్నా ప్రసాద్ తదితరులు అవనిగడ్డకు వెళ్లారు.



కోడూరు నుంచి కార్యకర్తల బైక్ ర్యాలీ

రెండు సెట్ల నామినేషన్లు దాఖలు

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, ఆయన సతీమణి కెప్టెన్ లక్ష్మి, ఎంపీపీ తుంగల సుమతీదేవి, నాగాయలంక మండల పార్టీ కన్వీనర్ భోగాది వెంకట శేషగిరిరావుతో కలిసి స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల అధికారి బాలసుబ్రహ్మణ్యంనకు ఒక సెట్ నామినేషన్ పత్రాన్ని అందించారు. ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్, సింహాద్రి వికాస్, రవళి, జెడ్పీటీసీ సభ్యుడు చింతలపూడి లక్ష్మీనారాయణ, కడవకొల్లు చైతన్య కలిసి మరో సెట్ నామినేషన్ పత్రాన్ని రిటర్నింగ్ అధికారికి అందజేశారు.



నామినేషన్ వేస్తున్న ఎమ్మెల్సీ రవీంద్రనాథ్, యువనేత వికాస్ దంపతులు



పార్టీ పతాకంతో సందడి చేస్తున్న ఖమ్మంనకు చెందిన కోదాటి నరసింహారావు

ప్రత్యేక ఆకర్షణగా పొడుగు కాళ్ల మనుషులు



చల్లపల్లికి చెందిన అల్లంశెట్టి కోట ఫ్రెండ్ సర్కిల్ ఏర్పాటు చేసిన పొడుగుకాళ్ల మనుషులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వైఎస్ రాజశేఖరరెడ్డి, సీఎం జగన్ చిత్రపటాలతో పొడవు కాళ్లు తగిలించుకున్న మనుషులు చేసిన నృత్యం ఆకట్టుకుంది. ఖమ్మం నుంచి వచ్చిన డాక్టర్ కోదాటి నరసింహారావు భారీ పార్టీ జెండా పట్టు కుని ర్యాలీలో ఆకర్షణగా నిలిచారు.

వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయం

ఘంటసాల: ఈ ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా, ఎమ్మెల్యేగా సింహాద్రి రమేష్ బాబు గెలుపు ఖాయమని ఘంటసాల ఏఎంసీ చైర్మన్ వేమూరి వెంకట్రావు అన్నారు. సింహాద్రి రమేష్‌బాబు నామినేషన్ సందర్భంగా ఘంటసాల మండలం నుంచి వందల మంది వైఎస్సార్ సీపీ శ్రేణులు అవనిగడ్డకు తరలి వెళ్లారు. ఘంటసాల నుంచి వేమూరి వెంకట్రావు ఆధ్వర్యంలో, వేమూరి ప్రవీణ్, దిరిశం పిచ్చేశ్వరరావు, దోనె వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో ఘంటసాల, దేవరకోట, ఘంటసాలపాలెం, కొత్తపల్లి, గ్రామాల నుంచి పెద్ద ఎత్తున పార్టీ నేతలు, కార్యకర్తలు ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు. కొడాలి భక్తపాల్, జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మల మురళీ ఆధ్వర్యంలో కార్యకర్తలు పెద్ద ఎత్తున ప్రత్యేక వాహనాల్లో జగనన్న నినాదం చేస్తూ భారీగా తరలివెళ్లారు.

మంచి మార్కుల సాధనకు చేతిరాత ముఖ్యం



మచిలీపట్నంటౌన్: ప్రతి విద్యార్థీ ఎక్కువ మార్కులు సాధించేందుకు అందమైన చేతిరాత ఎంతో అవసరమని జాతీయ కాలిగ్రఫీ నిపుణుడు పి.బి.చంద్ర సూచించారు. నగరంలోని జవ్వారుపేట శ్రీ వేంకటేశ్వర ఇంగ్లిషు మీడియం హైస్కూల్‌లో బుధవారం చేతిరాత ఉచిత వేసవి శిక్షణను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు చదవటం ఎంత ముఖ్యమో పరీక్షల్లో సమయానికి తగ్గట్టుగా వేగంగా, అందంగా రాయటం అంతే కీలకమని సూచించారు. ఎదుటి వారికి అర్థమయ్యేలా రాయటం ఎంతో అవసరమన్నారు. ఒకటో తరగతి నుంచి ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్, ఉపాధ్యాయులు ఈ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మే పదో తేదీ వరకు ఉదయం ఎనిమిది నుంచి 11.30 గంటల వరకు శిక్షణ తరగతులు కొనసాగుతాయని వివరించారు. స్కూల్ ప్రిన్సిపాల్ ఎం.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా ఉప్పాల రాము నామినేషన్

- కొండలమ్మ, అభయాంజనేయస్వామి ఆలయాల్లో రాము, హారిక ప్రత్యేక పూజలు
- భారీ ర్యాలీగా తరలివెళ్లిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు
- హాజరైన ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, ఎంపీ అభ్యర్థి చంద్రశేఖరరావు
- వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో ఉరకలెత్తిన ఉత్సాహం



నామినేషన్ వేసేందుకు భారీ ర్యాలీగా వెళ్తున్న పెడన ఎమ్మెల్యే అభ్యర్థి ఉప్పాల రాము, హారిక

పెడన: వైఎస్సార్ సీపీ పెడన ఎమ్మెల్యే అభ్యర్థి ఉప్పాల రమేష్(రాము)నామినేషన్ ప్రక్రియ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల ఉరకలెత్తిన ఉత్సాహం నడుమ కోలాహలంగా జరిగింది. బుధవారం ఉదయం ఉప్పాల రాము, హారిక దంపతులు తొలుత కొండలమ్మ గుడిలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పెడన చేరుకుని బస్టాండు సమీపంలో శ్రీఅభయాంజనేయస్వామి ఆలయంలో వైఎస్సార్ సీపీ మచిలీపట్నం ఎంపీ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖరరావుతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడ నుంచి భారీ ర్యాలీగా బయల్దేరారు. మార్గ మధ్యంలో రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి ర్యాలీలో పాల్గొన్నారు. యువత కేరింతలతో పట్టణం మారుమోగింది. జోహార్ వైఎస్సార్.. జోహార్ రాంప్రసాద్ అంటూ నివాళులర్పిస్తూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, రాముకు జై కొడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు నినాదాలు చేశారు. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చి అభిమానం చాటుకున్నారు. మరికొన్ని చోట్ల భారీ గజమాలలతో రాము, హారిక దంపతులకు స్వాగతం పలికారు. పలు చోట్ల గుమ్మడి కాయలతో మహిళలు దిష్టి తీశారు.

జనసందోహంతో ర్యాలీ ఆలస్యం

12 గంటలకు ఈఆర్వో కార్యాలయానికి చేరుకుని నామినేషన్ వేయాలని ప్రణాళిక రూపొందించుకున్నారు. అయితే కనీవినీ ఎరుగని స్థాయిలో పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు కోలాహలంగా నామినేషన్ కార్యక్రమానికి తరలిరావడంతో జాప్యం జరిగింది. ఈఆర్వో కార్యాలయానికి చేరుకునే సరికి మధ్యాహ్నం 2.30 గంటలైంది. అప్పటికే రాముకు సంబంధించి నామినేషన్ పత్రాలను ఆయన బాబాయ్ ఉప్పాల శ్రీనివాస్ తీసుకువెళ్లి వెరిఫికేషన్ చేయించి సిద్ధం చేయించారు. 2.45 గంటలకు ఉప్పాల రాము నామినేషన్ పత్రాలను పెడన ఎన్నికల అధికారి పి.వెంకటరమణకు అందజేశారు. మరొక నామినేషన్ పత్రాన్ని ఉప్పాల హారిక ఈఆర్వోకు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ రిజనల్ చైర్మన్ పిన్నింటి మహేష్, మునిసిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి, వైఎస్సార్ సీపీ నాయకులు బూరగడ్డ శ్రీకుమార్, మండల కన్వీనర్లు, ప్రజా ప్రతినిధులు, ఎంపీపీలు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న ఉప్పాల రాము, హారిక

ఉప్పాల రాము నామినేషన్‌కు..

కృత్తివెన్ను: వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఉప్పాల రమేష్ (రాము) బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. పెడన తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమానికి కృత్తివెన్ను మండలం నుంచి పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఉదయం నుంచి మోటార్‌బైక్‌లతో పాటు ప్రత్యేక వాహనాలలో వీరంతా పెడనకు ర్యాలీగా బయలుదేరి వెళ్లారు.

రాము నామినేషన్‌కు తరలివెళ్లిన పార్టీ శ్రేణులు

గూడూరు: పెడన ఎమ్మెల్యే అభ్యర్థి ఉప్పాల రాము నామినేషన్ కార్యక్రమానికి గూడూరు మండలం నుంచి పెద్ద ఎత్తున వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. గ్రామాల వారీగా ప్రత్యేకంగా ఆటోలు, ద్విచక్రవాహనాలకు పార్టీ జెండాలు కట్టుకుని ప్రదర్శనగా పెడనకు బయలు దేరారు. గూడూరులో ఎంపీపీ సంగా మధుసూదనరావు, పార్టీ అధ్యక్షుడు పర్ణం పదబాబు, కేడీసీసీబీ డైరెక్టర్ మోటేపల్లి రత్నారావు, పీఏసీఎస్ చైర్మన్ కారుమంచి కామేశ్వరరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బూరగడ్డ శ్రీకుమార్ తదితరులు ఈ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు.



బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న ఎంపీపీ సంగా మధు

కెరటంలా ఉప్పొంగిన వైఎస్సార్ సీపీ శ్రేణులు

మోపిదేవి: వైఎస్సార్ సీపీ అవనిగడ్డ ఎమ్మెల్యే అభ్యర్థి సింహాద్రి రమేష్‌బాబు నామినేషన్ వేస్తున్న సందర్భంగా మోపిదేవి మండలం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉప్పొంగిన కెరటంలా తరలివెళ్లారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు మోపిదేవి చేరుకుని స్థానిక శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం ఎదుట టెంకాలు కొట్టి, బాణసంచా కాల్చి భారీ ఊరేగింపుగా అవనిగడ్డ తరలివెళ్లారు. వందలాదిగా ద్విచక్ర వాహనాలు, వేలాదిగా పార్టీ నాయకులు, కార్యకర్తల కేరింతల మధ్య ర్యాలీ కొనసాగింది. మహిళా కార్యకర్తలు సీఎం జగనన్న కటౌట్‌కు క్షీరాభిషేకం చేశారు. బీసీ, ఎస్సీ, మైనార్టీ వర్గాలకు చెందిన జనసందోహంతో ప్రధాన సెంటర్ కోలాహలంగా మారింది. ఎన్నికల్లో ఎమ్మెల్యేగా సింహాద్రి రమేష్‌బాబు, ఎంపీగా డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావును భారీ మెజార్టీతో గెలిపించి, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరో సారి ముఖ్యమంత్రిని చేసేందుకు సిద్ధంగా ఉన్నామని పార్టీ నాయకులు పేర్కొన్నారు.



మోపిదేవి గుడిసెంటర్‌లో టెంకాయలు కొట్టి ర్యాలీని ప్రారంభిస్తున్న గరికిపాటి వెంకటేశ్వరావు

పోలీసుస్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు

కోనేరుసెంటర్: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీసు సిబ్బంది తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ ఆదేశించారు. ఆయన మంగళవారం రాత్రి ఆర్ పేట పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిధిలోని పోలింగ్ కేంద్రాల వివరాలు, సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక ప్రాంతాలను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ పరిధిలో రౌడీషీటర్ల వివరాలపై ఆరా తీశారు. రౌడీషీటర్ల కదలికల నిరంతరం నిఘా ఉంచాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పటిష్ట బందోబస్తు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛాయుత వాతావరణంలో వినియోగించుకునేలా చర్యలు తీసుకున్నామని వివరించారు.



ఆర్ పేట పోలీస్ స్టేషన్ అధికారుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న జిల్లా ఎస్పీ

పుష్కలంగా తాగునీటి సరఫరా

మచిలీపట్నంటౌన్: నగర ప్రజలకు ఈ వేసవిలో తాగునీటిని పుష్కలంగా సరఫరా చేస్తామని మునిసిపల్ కమిషనర్ సీహెచ్.వి.వి.ఎస్. బాపిరాజు తెలిపారు. తరకటూరు సమ్మర్ స్టోరేజీ ట్యాంకులో నీటి నిల్వలను ఆయన బుధవారం పరిశీలించారు. నగర ప్రజలకు రోజు విడిచి రోజు తాగునీరు సరఫరా చేస్తున్నామన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈస్ట్ రైవస్ కాలువ ద్వారా దాదాపు 15 రోజుల పాటు వచ్చిన నీటితో ట్యాంకును పూర్తి సామర్థ్యం మేర నింపామని పేర్కొన్నారు. వుట్లమ్మచెరువును కూడా నింపామన్నారు. జూన్‌లో కాలువలు వచ్చే వరకు ఈ నీరు నగర ప్రజలకు తాగునీటి సరఫరా చేసేందుకు పూర్తిస్థాయిలో సరిపోతాయని వివరించారు.



నీటి నిల్వలను పరిశీలిస్తున్న కమిషనర్ బాపిరాజు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మచిలీపట్నంటౌన్: నగరంలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఎలక్ట్రికల్ ఈఈ ఎం.భాస్కరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈడేపల్లిలోని శ్రీనివాసనగర్ కాలనీ, జల్దువారి వీధి, పోస్టల్‌కాలనీ, పంచాయతీరాజ్ కాలనీ ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి పది గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

జగనన్నతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యం

లంకపల్లి(ఘంటసాల): బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, అభివృద్ధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే సాధ్యమని దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు అన్నారు. ఘంటసాల మండలం లంకపల్లి చిన్నగూడెంలో బుధవారం రాత్రి ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కాలనీలో జరిగిన అభివృద్ధి, స్థానికంగా నెలకొన్న సమస్యలపై ఆరా తీశారు. ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వెంకటేశ్వరరావు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ అభివృద్ధి, సంక్షేమం జగనన్న వల్లే సాధ్యమన్నారు. రాజకీయంగా, సామాజికంగా సమాజంలో గౌరవప్రదంగా ఉంటున్నామంటే జగనన్న కల్పించిన అవకాశాలేనని వివరించారు. ఎమ్మెల్యేగా సింహాద్రి రమేష్‌బాబును, ఎంపీగా డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావును గెలిపించాలని కోరారు. వైఎస్సార్ సీపీ నాయకులు కొల్లూరి పద్మారావు, పెనుమత్స సుబ్బారావు, కనుమూరి రఘునందన్, మోటుపల్లి నాతాను, కొమ్ముకూరి రాజశేఖర్, బుర్రె సురేష్, కనుమూరి గోవిందు తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

కనులపండువగా అయ్యప్ప విగ్రహ ప్రతిష్ట

గూడూరు: మండలంలోని రాయవరం గ్రామంలో అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ట బుధవారం కనుల పండువగా జరిగింది. స్థానిక శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి, శ్రీ రుక్మిణి, సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ ప్రాంగణంలో నారగం వెంకటరత్నం, కమల దంపతుల చేతుల మీదుగా అయ్యప్ప విగ్రహ ప్రతిష్ట మహోత్సవం జరిగింది. గణపతి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వార్ల శిఖర జీవ యంత్ర సహిత నూతన ఆలయ ప్రతిష్ట కార్యక్రమం వేడుకగా సాగింది. ఎ.మధుసూదన్ నంబూద్రి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నసంతర్పణ చేశారు. గురువారం ఉదయం స్వాముల ఇరుముడుల సమర్పణ కార్యక్రమం జరుగుతుందని శ్రీ ధర్మ శాస్త్ర సేవాసమితి తెలిపింది.



ఆలయంలో కొలువు దీరిన శ్రీ అయ్యప్ప స్వామి